విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు,శుక్రవారం 03,నవంబర్ 2023

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజారక్షణ బేరి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకరరెడ్డి

విశాలాంధ్ర-రాప్తాడు : గత నాలుగున్నరేళ్లుగా కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజారక్షణభేరి చేపట్టామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే.ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాప్తాడులో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి రాష్ట్ర బస్సు జాతా జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖరీఫ్ సీజనులో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎకరాకు రూ.30000 నుండి 50 వేల రూపాయలు పంట నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, భూమి లేని నిరుపేదలకు రెండెకరాల సాగు భూమి పంపిణీ చేయాలన్నారు. ఉపాధి పథకం పనులు 200 రోజులకు పెంచడంతోపాటు రోజు వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. పీఎం నరేంద్ర మోడీ తీసుకొచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు రంగాన్ని ప్రభుత్వమే నడపాలని... రైతులకు మోటర్లకు మీటర్లు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించడం విరమించుకోవాలన్నారు. పెంచిన విద్యుత్ బిల్లులను, నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలన్నారు. చౌక దుకాణాల ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలన్నారు. ఏడాదికి 6 సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో డిగ్రీ పూర్తి చేసి చేసుకోవడానికి పనులు లేక హమాలీ పనులు వెళ్తున్నారంటే ఈ ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగాలు ఎన్ని కల్పిస్తున్నారో అర్థమవుతోందన్నారు. యువత ఎందరో ప్రస్తుతం ఉపాధి లేక ఈ విధంగా హమాలీ పనులు చేసుకుని బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారానికై ఈనెల 15వ తేదీన విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజా రక్షణ బేరి భారీ బహిరంగ సభ జరుగుతుందని.. వ్యవసాయ కూలీలు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి సిపిఎం కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎంఏ గఫూర్, రాష్ట్ర కమిటీ నాయకులు ఉమామహేశ్వరరావు, కృష్ణయ్య, శివ, నాగరాణి, దయా రమాదేవి, భాస్కరయ్య, సీనియర్ నాయకులు ఓబులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖరరెడ్డి, మండల కార్యదర్శి పోతులయ్య, సుబ్బిరెడ్డి, లక్ష్మన్న, వన్నూరుస్వామి, మధు, శేషు ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులు క్రమశిక్షణగా మెలగాలి

విశాలాంధ్ర - నార్పల : ఆటో కార్మికులు క్రమశిక్షణతో మెలగాలని నార్పల ఎస్సై రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. నార్పల మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధం గా గురువారం ఆటో యూనియన్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, నార్పల ఎసై రాజశేఖర్ రెడ్డి ఆటో యూనియన్ బోర్డు ఆవిష్కరించడం జరిగింది. వారు మాట్లాడుతూ ఆటోలకు ఎఫ్ సి లు, ఇన్సూరెన్సులు క్రమం తప్పకుండా చేయించాలన్నారు. ప్రతి డ్రైవర్ కు లైసెన్సులు ఉండాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉన్నట్టుగా ఆటో కార్మికులకు కూడా వారి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేయాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షులు విజె కృష్ణుడు,ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు,ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగవేణి,మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు జీ చిరంజీవి, నార్పల ఆటో యూనియన్ నాయకులు నాగమునిరెడ్డి, బైపరెడ్డి,సతీష్ గౌడ్,మల్లికార్జున తదితరులు పాల్గొనడం జరిగింది.

రాష్ట్ర అభివృద్ధి టీడీపీ తో సాధ్యం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: తెలుగుదేశం పార్టీ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కేశప్ప గురువారం మండలం లోని దర్గా పొన్నూరు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జైలు నుండి విడుదల అవడంతో వన్నూరు స్వామి దర్గా లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు బాబుష్యురిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్కన్న, సల్మాన్ వలి, కుమ్మరి వన్నూరప్ప, ఎస్సీ సెల్ నాయకులు ఆనంద్ ,వి ఎల్ రామాంజనేయులు, మహమ్మద్ రఫీ ,రామస్వామి, వాల్మీకి వన్నూరు స్వామి, హనుమంతు మిర్యాల గురు, వసంత, యూత్ నాయకులు సంతోష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు నిధులతో గ్రావెల్ రోడ్డు పనులు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం పోలికి గ్రామంలో మండల ప్రజా పరిషత్తు నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాగమ్మ మాట్లాడుతూ గతంలో గడపగడపకి కార్యక్రమంలో పాల్గొనడానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామ ప్రజలు ఆయన దృష్టికి రోడ్డు విషయం తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డికి మండల పరిషత్ నుంచి నిధులు విడుదల చేయాలని చెప్పడంతో ఆమె కూడా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయడం జరిగింది అన్నారు. ఎన్నో రోజులుగా శిథిలావస్థకు చేరుకున్న రోడ్డును మాజీ ఎమ్మెల్యే మరియు ఎంపీపీ కృషి వల్ల రోడ్డు నిర్మాణ పనులు జరిగినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు గాజుల చిన్న వెంకటేశు, వరదారెడ్డి, పెద్ద వెంకటేశు దేవేంద్ర, మల్లయ్య స్వామి, అంగిడి శ్రీనివాసులు, తిమ్మారెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత మెటీరియల్‌తో బ్యారి కేడ్లు

విశాలాంధ్ర - జేఎన్టీయూ ఏ: జేఎన్టీయూ అనంతపురం మెకానికల్ విభాగం వర్క్ షాపు లోపాత మెటీరియల్ తో 10 బ్యారి కేడ్లను తయారు రూపకల్పను చేసిన బ్యారి కేడ్లను గురువారం ఉపకులపతి ఆచార్య జి.రంగ జనార్ధన ప్రారంభించారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ పాత ముడి పరికరాలను వినియోగించుకుని నవనిర్మాణ దిశగా, సాంకేతిక వనరులను వినియోగించుకొని మరెన్నో అద్భుతాలు సృష్టించవచ్చునని విశ్వవిద్యాలయ ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ బ్యారికేడ్లను తయారుచేసిన మెకానికల్ వర్క్ షాపు ఇంచార్జి ని, భోధనేతర సిబ్బందిని ఉపకులపతి, రెక్టార్ ఆచార్య యం. విజయ కుమార్ అభినందించారు. ఈకార్యక్రమంలో ఆచార్య బి.దుర్గా ప్రసాద్,కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యస్.వి. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ. అరుణ కాంతి, భువన విజయ, ఆచార్య బి. చంద్ర మోహన్ రెడ్డి , ఆచార్య ప్రశాంతి , డా కళ్యాణి రాధా, మెకానికల్ వర్క్ షాపు ఇంచార్జ్ డాక్టర్ ఓం ప్రకాష్ , ఆచార్య టి. బాల నరసయ్య, డా యస్. చంద్ర మోహన్ రెడ్డి గారు, డా కె.యఫ్. భారతి, డా యం. రామ శేఖర రెడ్డి , డాక్టర్ దిలీప్ కుమార్ , అజిత , సెక్యూరిటి హెడ్స్ వెంకటేష్,ఖాసీం,భోధన , భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ ని కలిసిన ఆర్డీఓ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో గుంతకల్లు ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన వి.శ్రీనివాసులురెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ని కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు సజావుగా చేపట్టడం, జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ ను గడువులోపు పరిష్కరించడం, గుంతకల్లు ప్రత్యేక అధికారిగా హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయడం, సకాలంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, రీసర్వే, ఓటర్ లిస్ట్ అప్డేట్ చేయడంలాంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకి సూచించారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

విశాలాంధ్ర-ఉరవకొండ: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చ దిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇంచార్జ్ డిసిపిఓ వెంకటేశ్వరి అన్నారు. స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి ఎన్ శ్రీదేవి ఆదేశాల మేరకు,జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ఆర్డిటి స్కూల్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జోగిని,బషివిని, మాతంగి ఈ సాంఘిక దురాచారమును రూపుమాపాలని బాల్య వివాహాలు జరక్కుండా, చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆమె తెలిపారు. ఫంక్షన్ హాల్స్, టెంపుల్స్ ముందు బాల్యవివాహాల నిషేధం పై హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయించాలని అలాగే ప్రతి సచివాలయ పరిధిలో బాల్యవివాహాలపై మరియు మత్తు పదార్థాల నిషేధంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలనితెలిపారు.పుస్తకాలు మోసే వయసులో పుస్తెల భారంతో అమ్మాయిలు అత్తారింటిలో ఎన్ని ఇబ్బందులు పడతారో బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను మరియు అమ్మాయి చదువుకుంటే ఎన్ని ప్రయోజనాలు ఆ కుటుంబానికి కలుగుతాయో ఆలోచించాలని కాబట్టి అమ్మాయిలందరినీ కూడా చదివిస్తూ ఈ బాల్యవివాహాలను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, జీవో ఎంఎస్ నెంబర్ 31,39 కచ్చితంగా అమలు చేద్దామని అందరూ కలిసికట్టుగా బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ మోనాలిసా, ఎంపీడీవో విజయ లలిత, మండల విద్యాశాఖ అధికారి ఎర్రి స్వామి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ,సోషల్ వర్కర్ వెంకట్ కుమార్, మహిళా పోలీసులు అంగన్వాడి వర్కర్లు గ్రామ ప్రజలు, పాల్గొనడం జరిగింది.

చంద్రబాబుకు మధ్యంతర బెయిలే..!

▶▶నిజం గెలిచిందని చెప్పుకోవడం హాస్యాస్పదం
▶▶నాలుగు వారాల తర్వాత మళ్లీ జైలు తప్పదు
▶▶వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్

విశాలాంధ్ర - శింగనమల : చంద్రబాబుఆరోగ్య పరిస్థితి దృష్ట్యా హైకోర్టు మధ్యంతర బెయిల్ మాత్రమే ఇచ్చిందని వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్ తెలిపారు, టీడీపీ నేతలు మాత్రం 'నిజం గెలిచింది' అంటూ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు, దేశంలో ఏ ఖైదీకయినా అనారోగ్య కారణాలు ఉంటే న్యాయస్థానాలు బెయిల్ ఇస్తాయని, చంద్రబాబు విషయంలో కూడా అదే జరిగిందని చెప్పారు. కంటి ఆపరేషన్ కోసం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ నాలుగు వారాల పాటు మంజూరు చేసిందని గుర్తు చేశారు, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు పాత్ర ఉందని, ఆయనకు బెయిల్ ఇవ్వాలని దాఖలు చేసిన పిటీషన్ వాదనల సమయంలో చంద్రబాబు తరపు న్యాయవాదులు కంటి చికిత్సను ప్రస్తావించడం వల్లే బెయిల్ వచ్చిందని తెలిపారు, స్కిల్ స్కాంలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ కీలకంగా ఉన్నారని, అయితే ఆయన్ను విదేశాలకు పంపించి విచారణకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు, మధ్యంతర బెయిల్ విషయంలోనూ రాజకీయం చేయడం సరి కాదన్నారు. నాలుగు వారాల మధ్యతర బెయిల్ గడువు ముగిశాక మళ్లీ చంద్రబాబు జైలుకు వెళ్తారని స్పష్టం చేశారు.

ఆలయానికి వైకుంఠ రథం అందజేత

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: మూడవ రోడ్డులోని షిరిడి సాయి ఆలయానికి సంబంధించి రూ.5 లక్షల విలువ చేసే వైకుంఠ రథాన్ని మాజీ కార్పొరేటర్, ప్రస్తుత కోఆప్షన్ సభ్యులు లక్ష్మిరెడ్డి అందజేశారు. గురువారం 3వ రోడ్డులోని ఆలయం వద్ద షిరిడి సాయి సేవా సమితి వ్యవస్థాపకులు జయచంద్ర చౌదరి ఆధ్వర్యంలో లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులు వైకుంఠ రథాన్ని ఆలయానికి అందించారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ దేవుని ఆశీస్సులతో తనకున్న కొంతలో సేవ చేస్తున్నానని తెలిపారు. గతంలోనూ ఆలయానికి వైకుంఠ రథాన్ని అందజేశానని, ఆ వాహనం చిన్నదిగా ఉండటంతో ఈరోజు పెద్ద వాహనాన్ని అందించానన్నారు. ప్రజలు దేవుని సన్నిధికి వెళ్ళడానికి ఇబ్బంది పడకూడదనే మంచి ఉద్దేశంతో ప్రజా శ్రేయస్సు కోరి దేవుని ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని చేశానన్నారు. దేవుడి దయతో మరింత సహాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. లక్ష్మిరెడ్డి సేవలను శిరిడి సాయి సేవా సంస్థ వ్యవస్థాపకులు జయచంద్ర చౌదరి ఆలయ సభ్యులు ఆనంద్, గంగిరెడ్డి, సాయిరాం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం సేవా కార్యక్రమాల్లో లక్ష్మారెడ్డి ముందుంటారని కొనియాడారు. లక్ష్మిరెడ్డి కుటుంబానికి ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి అధ్యాపకులు సుందరేశం నలబొలు శ్రీలక్ష్మి .శశి, లక్ష్మీదేవి, నాయుడు, రఘునాథ్, సతీష్, కొర్రపాటి శ్రీనివాసులు, లక్ష్మీనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలసలను నివారించి..ఉపాధి పనులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్

విశాలాంధ్ర-శింగనమల: జిల్లా వ్యాప్తంగా కరువు చాయలు అలముకున్నాయని, కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, వలసలను నివారించి, ఉపాధి పనులు కల్పించాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కేశవరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి పెద్దయ్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వై ఎల్ రామాంజనేయులు డిమాండ్ చేశారు, పాట్నాలో జరుగుతున్న జాతీయ మహాసభల్లో తీర్మానం చేసినట్లు వారు పేర్కొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన కరువు నెలకొందని, కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతూ మృత్యువాత పడుతున్నారని, కూలీలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం శోచనీయమన్నారు, ఒక్కో కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు కల్పించి 600 రూపాయలు దిన కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర- అనంతపురం: టిడిపి కార్యకర్త బూత్ ఇంచార్జ్ గోవిందు ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో, ఖర్చులకోసం మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి గురువారం రూ.15 వేలు సాయం చేశారు. ఇటీవలే వారి కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గురువారం మరోసారి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఫోను ద్వారా ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి స్వప్న, యూనిట్ ఇంచార్జ్ బోయ మూర్తి, వాల్మీకి సాధికారిక సమితి రాష్ట్ర నాయకులు సుదర్శన్ వారి కుటుంబాన్ని సందర్శించి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అందించిన డబ్బును వారికి అందించారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర- అనంతపురం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పని చేస్తోందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు.నగరంలోని బుడ్డప్పనగర్,సూర్యనగర్ లలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంప్‌లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సీఎంగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు.వైయస్సార్ ఆరోగ్యశ్రీని మెరుగు పరిచి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు.వైయస్సార్ విలేజ్ క్లినిక్,మున్సిపల్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటిలో స్పెషలిస్ట్ వైద్యులను ఏర్పాటు చేసి పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించడానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు లీలావతి, సాకే చంద్రలేఖ, అబుసాలెహ, సైఫుల్లా బేగ్, వైయస్సార్ జిల్లా కార్యదర్శి గోపాల్ మోహన్, ఎస్సి విభాగం నగర అధ్యక్షుడు సాకే కుళ్లాయస్వామి పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర - అనంతపురం : అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు గురువారం గుల్జారు పేటలోని 18 డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్, అనంతపురం నగరం మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న ఆధ్వర్యం లో బాబు సూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. భవిష్యత్తులో టిడిపి అధికారంలోకొస్తే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి డి.హసీనా బేగం, యూనిట్ ఇంచార్జి ఎస్. ఖలందర్, 130 బూత్ ఇంచార్జ్ లు ముస్తాక్, నిజాముద్దీన్, రాములమ్మ, డివిజన్ ఇంచార్జ ఖలందర్, మంజునాథ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి గురువారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం, రీసర్వే ప్రక్రియ,ఇతర అంశాలపై కలెక్టర్ లతో సర్వే సెటిల్మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్ తో కలిసి సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రీ దేవి, తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం కింద రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మూడవ దశలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే ప్రక్రియలో మరింత వేగం పెంచాలన్నారు.ఆయా గ్రామాల్లో పెండింగ్ ఉన్న స్టోన్ ప్లాంటేషన్ కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. రీసర్వే కింద చేపట్టాల్సిన అన్ని రకాల ప్రక్రియలను నాణ్యతగా చేపట్టాలన్నారు. నిర్దేశిత గడువులోపు మూడవ దశ రీసర్వే ప్రక్రియను ప్రాధాన్యతగా పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యురో సారథ్యంలో దాడులు

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం జిల్లాలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యురో సారథ్యంలో ఇతర రాష్ట్రాల మద్యం, ఇసుక అక్రమ రవాణాలపై అక్టోబర్ నెలలో దాడులు కొనసాగాయి. ఇతర రాష్ట్రాల నుండీ జిల్లాలోకి అక్రమంగా మద్యం తరలించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా... జిల్లాలో నాటు సారా తయారీ, నిల్వ, అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా ఉంచారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యురో బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ కెకేఎన్ అన్బురాజన్ ఆదేశాలు మేరకు సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో సెబ్ పోలీసు బృందాలు గత నెలలో జిల్లాలోకి అక్రమంగా ఇతర రాష్ట్రాల మద్యం రవాణా చేస్తుండటంపై దాడులు నిర్వహించి 24,672 టెట్రా పాకెట్లు, 1070 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కర్నాటక నుండీ జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వారిపై 192 కేసులు నమోదు చేసి 218 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 26 కేసులు నమోదు చేసి 26 మందిని అరెస్టు చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న 26 వాహనాలు సీజ్ చేశారు.

వరుణ యాగం జరిపిన కాపు దంపతులు

విశాలాంధ్ర-రాయదుర్గం : వరుణ యాగంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలో కోటలో వెలసిన స్వయంభు జంబుకేశ్వర స్వామి ఆలయంలో వరుణుడి రాక కోసం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వరుణ యాగం కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి,సతీమణి కాపు భారతి, కోడలు అలేఖ్య రెడ్డితో కలిసి కాపు రామచంద్రారెడ్డి యాగంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జంబుకేశ్వరుడు మూలవిరాట్ పై దాదాపు 1000 బిందెలకు పైగా నీటిని వేసి కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు మీడియాతో మాట్లాడారు. గత నాలుగేళ్లలో వర్షాలు సమృద్ధిగా కురిసాయని ఈ ఏడాది వర్షాలు పడక రైతన్నలు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. స్వయంభు జంబుకేశ్వర స్వామి ఆశీర్వాదాలతో వర్షం సమృద్ధిగా కురిసి రైతన్నలు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వరుణ యాగం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ శిల్ప, టౌన్ కన్వీనర్, కౌన్సిలర్లు, మండల కన్వీనర్లు, భక్తులు బ్రాహ్మణ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర - జె ఎన్ టీ యుఏ: స్కూల్ గేమ్స్ సెలక్షన్లో తైక్వాండో యు-14 , యు 17 బాలికలు పోటీలు గురువారం ఇండోర్ స్టేడియం అశోక్ నగర్లో నిర్వహించినట్లు అనంతపురం జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ బి. సుగుణమ్మ , సత్యసాయి జిల్లా సెక్రెటరీ అంజన్న , ఎల్ నాగరాజు పేర్కొన్నారు. అంతర్ జిల్లాస్థాయి కి సృజన, జ్ఞాన శ్రీ ,గాత్ర ,సింధు, తితిక్ష, ముహారిక , దృశ్యన,దిల్షాద్, సెలక్షన్స్ లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గురుస్వామి చైర్మన్ శాంతరాజ్,మిగతా కోచులు, ఎస్ జి ఎఫ్ సిబ్బంది వేణుగోపాల్, చల్లా ఓబులేసు,కోటప్ప, శకుంతల పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు,శుక్రవారం 03,నవంబర్ 2023

సీపీఐ రాష్ట్ర బృందం కరువు పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - శ్రీ సత్యసాయి : ఈనెల 4వ తేదీ శనివారం సిపిఐ రాష్ట్ర బృందం శ్రీ సత్యసాయి జిల్లాలో కరువు పర్యటన చేస్తున్నారని శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల నాలుగవ తేదీ శనివారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులేసు, రామచంద్రయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమయ్య, వీరి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర బృందం కరువు పర్యటన చేస్తున్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గతంలో10 నుంచి 14 లక్షల ఎకరాల్లో వేరుశనగ వేసేవారు ప్రస్తుతం వర్షాలు లేక పంటలు చేతికందే పరిస్థితి లేదు సాగు చేసిన ప్రతి రైతుకు ఎకరాకు 30 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పంట సాగు చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు. సత్యసాయి జిల్లాలో సిపిఐ కరువు బృందం బత్తలపల్లి, ధర్మవరం, పుట్టపర్తి మండలాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు కాలర్ షిప్ ఇవ్వాలని కోరారు. వర్షాలు లేక వేరుశనగ పంట ఎండిపోతున్న అధికార పార్టీ నాయకులు కనీసం వారు రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వారు ఏమున్నా దొంగ ఓట్లు ఎక్కించుకోవడం లో ఉన్న శ్రద్ధ రైతుల గురించి వారు ఆలోచన చేసిన పాపాన పోలేదన్నారు. ఈ జిల్లా అత్యంత కరువు జిల్లా అయినందున ఇక్కడ ఉపాధి కోసం వలసలు నగరాలకు అధిక సంఖ్యలో వెళుతుంటారు కావున వారికి ఉపాధి హామీ పథకం సంవత్సరం పొడుగునా కల్పించి వారిని ఆదుకోవాలని సూచించారు. ఈనెల 5, 6, 7 వ తేదీలలో జిల్లాలోని అన్ని మండలాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ఎండిన వేరుశనగ పంటను పరిశీలన చేస్తామని శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వి, రమణ, సిపిఐ వుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, ధర్మవరంనియోజకవర్గ కార్యదర్శి మధు,మహదేవప్ప,సిపిఐనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల పాకగా...బస్ షెల్టర్

బస్సు షెల్టర్ దుర్వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సీపీఐ

విశాలాంధ్ర-ఎన్ పీ కుంట: మండల కేంద్రమైన నంబుల పూలకుంట బస్టాండ్ కూడలిలో ఉన్న బస్సు షెల్టర్ ను దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందని మండల సిపిఐ కార్యదర్శి వంకమద్ది జి రమణ పేర్కొన్నారు. బస్సు సెంటర్ ప్రజలకు ఉపయోగపడుతుందని నమ్మకంతో నిర్మించిన దానిని కొందరు మేకల, గొర్రెల కాపరులు వాటిని బస్సు షెల్టర్ లో ఉంచడంతో దుర్వినియోగం చేస్తున్నారని సిపిఐ కార్యదర్శి వివరించారు. ప్రజల అవసరాల కోసం నిర్మించిన బస్సు షెల్టర్ లోకి మేకలు, గొర్రెలు తోలడం తో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గొర్రెలు మేకలు బస్సు షెల్టర్ ఉంచడంపై మండల పంచాయతీ అధికారులకు దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించకపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన బస్సు షెల్టర్ లోకి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ప్రజలకు ఉపయోగపడే భవనాలు సైతం శిథిలావస్థకు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మేకలు గొర్రెలను బస్సు షెల్టర్ లోకి ప్రవేశించకుండా గొర్రె కాపరులకు సూచించాల్సిన అవసరం పంచాయతీ సిబ్బందిపై ఉందని మండల సిపిఐ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణం నందు గురువారం గుర్తు తెలియని మగ వ్యక్తి అనారోగ్య కారణముతో చని పోయి వున్నాడు, కావున సదరు వ్యక్తి ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ రూం లో వుంచడము అయంది, సదరు వ్యక్తి ఆచూకీ తెలిసి వుంటే తెలుప గలరు పెనుకొండ పోలీసులు పత్రికలకు సమాచారాన్ని అందించారు బంధువుల కానీ స్నేహితులకు కానీ సమాచారాన్ని అందజేయాలని తెలిపారు.

నల్లమాడ ను కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-నల్లమాడ: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని గురువారం సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలలో అతివృష్టి అనావృష్టి తో వ్యవసాయ భూములలో వేరుశనగ, కంది తదితర పంటలు సాగు చేశారు. దీంతో రైతాంగం నష్టాల్లో కూరుకుపోయింది.ఖరీఫ్ సీజన్లో పంటలు పెట్టి నష్టపోయిన ప్రతి రైతుకు పంటనష్టం పరిహారం చెల్లించాలన్నార, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలిని సీపీఐ పార్టీ తరవున డిమాండ్ చేస్తున్నామన్నారు. స్పంధించిన డిప్యూటీ తహశీల్దార్ పై అధికారుల కు తెలియజేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చంద్ర, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమణ, సిపీఐ మండల నాయకులు గంగాధర్, నాగేంద్ర, సూరి, తదితర లు పాల్గొన్నారు.

పట్టు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వం పట్టు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తోందని, వీటిని పట్టు రైతులందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు ధర్మవరంలోని పట్టుగూళ్ల మార్కెట్ ను ఆకస్మికంగా పరిశీలించారు.తదుపరి అక్కడే ఉన్న రైతులతో, పట్టుగూళ్ల వ్యాపారస్తులతో,అధికారులతో,పట్టుగూళ్ల ధరలు మల్బరీ తోటల సాగు తదితరు వాటి గూర్చి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పట్టుగూళ్లకు మార్కెట్లో మంచి ధరలు పలుకుతున్నాయని ఈ ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. టిడిపి హయాంలో కరువు కారణంగా బోరు బావుల్లో నీరు లేక చాలామంది రైతులు మల్బరీ తోటలు ఎండిపోయాయని తెలిపారు. నేడు వర్షాలు సమృద్ధిగా కురిసి, బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉందని తెలిపారు. ఇప్పుడు పట్టు రైతులు బలబరీ తోటలను అధికంగా సాగు చేసుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించుకోవడం జరుగుతోందని తెలిపారు. మల్బరీ తోటల సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలను కూడా ఇస్తోందని వారు తెలిపారు. అంతేకాకుండా రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇన్సెంటివ్ బకాయిలు కూడా త్వరలోనే మంజూరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికల్చర్ ఏడి నరసింహులు, డివోలు దామోదర్ రెడ్డి, రమణారెడ్డి, రిలర్లు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులను కల్పిస్తాం

ఎంపీడీవో సౌజన్యకుమారి

విశాలాంధ్ర-ధర్మవరం: గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులను తప్పనిసరిగా కల్పిస్తామని ఎంపీడీవో సౌజన్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిధిలోని రేగాటిపల్లి గ్రామంలో వారు కూలీలతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితి నెలకొన్న దృష్ట్యా, అందరికీ పనులు కల్పించడం జరుగుతుందని, దీనిని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా కొన్ని కుటుంబాల వారికి నూరు రోజులు పూర్తి అయ్యాయని తెలుపగా త్వరలో కరువు మండలాలకి అదనంగా 50 రోజులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం నూరు రోజులు పూర్తికాని కుటుంబాలు పనికి కూడా రావచ్చునని వారు తెలియజేశారు. కాలువ పూడిక తీయుట, చెక్ డాం లో పూడిక తొలగించడం,పశువుల తాగునీటి కోసం చెరువు నందు కాటిల్ ఫండ్ త్రవ్వకం పనులు ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డి లోకన్న, ఏఈ రమణ, ఏపీఓ అనిల్ కుమార్ రెడ్డి, కార్యదర్శి సువర్ణ, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడు కనిపించలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు

విశాలాంధ్ర - కొత్తచెరువు : మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన శివ కుమార్ అనే విద్యార్థి కనిపించుట లేదని వారి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఎస్సై సురేష్ బాబు తెలిపారు. ఆ గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు శివకుమార్ కొత్తచెరువు లోనే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్ళనందున తల్లిదండ్రులు ఎందుకు వెళ్లలేదని మందలించడంతో ఆరోజు సాయంకాలం నుండి కనిపించకుండా ఎక్కడికో వెళ్లిపోయారన్నారు. కావున ఆచూకీ లభ్యమైతే ఈ నెంబర్కు 9440796838 తెలపాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

- ▶▶మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి
- ▶▶5వ తేదీ లోపు 132 భవన నిర్మాణాలు స్వాధీనపరచుకోవాలి
- ▶▶హౌసింగ్ భవన నిర్మాణాలలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - పుట్టపర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను నిర్దేశించి గడువు లోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రియారిటి భవన నిర్మాణాలపై , హౌసింగ్ నిర్మాణ పనులపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో, మండల స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన గ్రామా వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వై. యస్. ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రియారిటి భవన నిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందని భవన నిర్మాణాలలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ప్రతి మండలానికి వారానికి నిర్దేశించిన లక్ష్యాలను ఆవారంలోగానే పూర్తి చేయాలని ఎంపిడిఓలను,ఇంజనీర్లు ఆదేశించారు. ప్రియారిటి భవన నిర్మాణాలు అత్యంత ప్రమాణాలతో రూపుదిద్దు కొనేటట్లు చూడాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి అవసరం మేరకు సిమెంటు ఇండెంట్లు పంపాలన్నారు. జిల్లాలో భవన నిర్మాణాలకు సంబంధించి రోజురోజుకు పురోగతి కనిపించేలా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించాలన్నారు. అలాగే జరిగిన పనులకు బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు వివిధ సేవలు అందిస్తుందని ప్రైవేటు భవనాలలో ఉండే గ్రామ సచివాలయలను ప్రభుత్వ భవనాలలోకి మార్చేందుకు సచివాలయ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. 45 సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయినాయని వాటిని సంబంధిత పంచాయతీ సెక్రటరీ స్వాధీన పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు కావలసిన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేయడం జరుగుతుందని అందువల్ల అధికారులు ఆర్బికేల భవన నిర్మాణాలలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. 47 ఆర్ బి కే లు పూర్తయిని వాటిని నవంబర్ 5వ తేదీ లోపు అగ్రికల్చర్ అధికారులకు స్వాధీన పరచాలని ఆదేశించారు. డాక్టర్ వైయస్ ఆర్ హెల్త్ క్లినిక్ ల ద్వారా గ్రామాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లు ఏర్పాటు చేయడం జరిగిందని 40 భవనాలు పూర్తయ్యాయని వాటిని స్వాధిని పరచాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రభుత్వ ప్రయారిటీ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా భవన నిర్మాణాలలో వెనుకబడిన మండలాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. హౌసింగ్ లో మంచి ఫలితాలు సాధించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణాల పనులు ఎలా అమలు అవుతున్నాయో పరిశీలించాలని తెలిపారు, నిరంతర పర్యవేక్షణలో జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఎస్సీ ఈ గోపాల్ రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా సమితి

విశాలాంధ్ర-పుట్టపర్తి : శ్రీ సత్య సాయి జిల్లాలో ని 32 మండలాలలో కేవలం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి మిగిలిన పదకొండు మండలాలను ప్రకటించకపోవడం చాలా విచారించదగ్గ విషయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ కొండయ్యకు మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాలను వర్షం సరైన సమయంలో రాకపోవడంతో రైతులు అన్ని రకాల పంటలు నష్టపోవడం జరిగిందన్నారు.పంట నష్ట పరిహారం అంచనా వేయడంతో పాటు రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వలన రైతు విపరీతంగా నష్టపోవడం జరుగుతున్నదన్నారు. జిల్లాలో ఇప్పటికే రైతులు వలసలు బాట కట్టడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు ఆపలని, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులను 300 రోజులు పని కల్పించి 600 రూపాయలు రేట్లు పెంచాలని గ్రామీణ ప్రాంతాలలో పశువులకు గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జేవి రమణ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ హంద్రీనీవా కాలవ ద్వారా జిల్లాలోని 32 మండలాలలోని అన్ని చెరువులను నీటితో సమృద్ధిగా నింపాలని ,బోర్లు ఇంకిపోకుండా చూడాలన్నారు. రబి సీజన్లో రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు ఎరువులు పూర్తిగా ఉచితంగా అందించి రైతన్న ఆదుకోవాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కరువు బృందం జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంమహదేవ్ ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, అడపాల వేమనారాయణ రైతు సంఘం జిల్లా నాయకులు, పోలేపల్లి ముత్యాలప్ప రామగిరి, మండల రైతు సంఘం కార్యదర్శి, కుల్లాయప్ప వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు కార్డు

ఆర్డీఓ రమేష్ రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం : నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు కార్డు తప్పనిసరిగా ఉండేలా అధికారులు బిఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఆర్డీవో రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆర్డిఓ కార్యాలయంలో స్పెషల్ సమ్మర్ రివిజన్ 2024 గూర్చి అర్బన్, రూరల్,బి ఎల్ ఓ లకు, సూపర్వైజర్లకు వారు వివరించారు. అనంతరం ఆర్డీవో రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాను బాగా పరిశీలించి, అందులో డబుల్ ఎంట్రీలు, డెత్తులు, షిఫ్ట్ అయినవారు ఏమైనా ఉంటే ఫారం-7 లో దరఖాస్తు చేయాలని తెలిపారు. కొత్తగా ఓటరు నమోదుకి దరఖాస్తు చేసుకున్న వారు ఆధారాలు తప్పనిసరిగా స్వీకరించి, నివాసం ఉన్నారా? లేదా? అనే వాటిని తప్పనిసరిగా విచారణ చేసి, బిఎల్ఓ యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా జంక్ క్యారెక్టర్స్ అనగా జీరో డోర్ నెంబర్లు ఉన్నవి జెండారు తప్పుగా ఉండేవి, పేరు తప్పుగా ఉండేవి, ఒకే డోర్ నెంబర్ లో పది మంది కన్నా ఎక్కువ ఉండే వాళ్లను విచారణ చేసి వాటిని ఫారం-8 లో నోషనల్ నెంబర్స్ ఇవ్వాలని తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లో కూడా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు కార్డు ఉండేలా చర్యలు చేపడుతూ, పారదర్శకతతో, తమ విధులను బాధ్యతగా, సేవాభావంతో నిర్వర్తించినప్పుడే ఓటర్ జాబితాకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యుగేశ్వరి దేవి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాయి ప్రసాద్, పట్టణ, గ్రామీణ బిఎల్వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఆరోగ్య సురక్ష

మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రజలందరికీ ఆరోగ్య సురక్షను ఇవ్వడమే మా ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోనీ తిక్క స్వామి నగర్ సచివాలయము సాయి నగర్ సచివాలయము ఎల్సికేపురం సచివాలయంలో నిర్వహించబడిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ వాళ్ల ఏర్పాటుచేసిన పౌష్టిక ఆహార ప్రదర్శనను తిలకించారు. తదుపరి కార్యక్రమానికి వచ్చిన ప్రజల యొక్క ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు సచివాలయాల్లో 898 మంది ప్రజలు రావడం జరిగిందని వారందరికీ ఉచిత వైద్య చికిత్సలతోపాటు మందులు కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 226 మంది కంటి సమస్యలు ఉన్నవారు కు కంటి వైద్య చికిత్సలను అందించడం జరిగిందని, ఇందులో 77 మందికి కంటి అద్దాలను ఉచితంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఆనంద్ కుమార్, స్పెషల్ ఆఫీసర్లు బెస్త శివ, ఆసిఫ్, కిరణ్, కౌన్సిలర్లు రాయపాటి మంజుల, చౌడం సుబ్బలక్ష్మి, వార్డు ఇన్చార్జులు రాయపాటి రామకృష్ణ, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠాపన వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కెపిటివీధిలో గల పంచ నాథేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమాలు ఈనెల 30వ తేదీ నుండి నవంబర్ రెండవ తేదీ వరకు నాలుగు రోజులు పాటు అంగరంగ వైభవంగా ఆలయ అభివృద్ధి కమిటీ వారు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా చివరి నాలుగవ రోజు గురువారం శమి నారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, ఉదయము వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా ప్రాణ ప్రతిష్టను నిర్వహించారు. శేష హెూమాలు, కలోన్యాస హెూమాలు, పంచామృతాభిషేకం, జ్వాలా, బలి దర్పణ, గోదర్శన, పుష్పాండ చేదన, హారతి, తదితర పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు మోహన స్వామి, శిష్య బృందం సుమంత్ కుమార్, లక్ష్మీపతి, రాజేష్ ఆచార్యులు, ఫణి కుమార్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపాలెం హరి ప్రసాద్, కార్యదర్శి రామ శేషయ్య మాట్లాడుతూ భక్తాదులు, దాతల సహాయ సహకారాలతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నామని, అదేవిధంగా విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం భక్తాదులు, దాతల నడుమ నిర్వహించడం మాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ గుడి అతి పురాతనమైన శివాలయం అని, జీర్ణోద్ధరణ పనులు పూర్తి గావించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డిని కలిసిన చౌళూరు మధుమతి రెడ్డి

విశాలాంధ్ర - హిందూపురం : తిరుపతి నందు రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చౌలూరు మధుమతి రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలు మంత్రితో విన్నవించారు.హిందూపురం రాజకీయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఈరంపల్లి సుధాకర్ రెడ్డి,నల్లపల్లి బాబు రెడ్డి,అనిల్ రెడ్డి,తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన విష్ణు ప్రియ

విశాలాంధ్ర - ధర్మవరం : రాష్ట్ర ఫుట్బాల్ పోటీలకు పట్టణంలోని సుందరయ్య నగర్ లో గల శ్రీ గణేష్ పురపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విష్ణు ప్రియ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ రెడ్డి పాఠశాల పిఈటి వీర తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలోని ఆర్ డి టి స్టేడియంలో జిల్లా ఫుట్బాల్ అండర్-17 పోటీలు నిర్వహించారని, ఇందులో అనంతపురం జిల్లా తరఫున విష్ణు ప్రియ ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ అమ్మాయి నవంబర్ మూడవ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో పాల్గొంటుందని వారు తెలిపారు. తదుపరి హెచ్ఎం తో పాటు పాఠశాల చైర్మన్ సోమశేఖర్, కౌన్సిలర్ సుజాత, వార్డు ఇన్చార్జ్ బాల్రెడ్డి, పిఈటి వీర, ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు విష్ణు ప్రియ ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని 70 మంది రోగులకు శ్రీ సత్య సాయి భజన మండలి నిర్వాహకులు.. సాంబశివుడు, విద్యాసాగర్, శేషాచారి, వినోద్ ల ఆధ్వర్యంలో పాలు, బ్రెడ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహాయ సహకారంతోనే ఈ సాయి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం మాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. నేటి ఈ కార్యక్రమానికి ఎర్రం పల్లి వెంకటేశులు దాతగా వ్యవహరించడం పట్ల భజన మండలి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఆసుపత్రిలోని వైద్యులు,నర్సులు చేతుల మీదుగాఅందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ నజీర్ మాట్లాడుతూ బాబా ఆశీస్సులతో భజన మండలి వారు నిర్వహిస్తున్న ఈ మానవ సేవా కార్యక్రమం రోగులకు వరం లాగా మారిందని, ఎంతోమంది గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చు వారికి ఈ కార్యక్రమం కొంత ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. అనంతరం శ్రీ సత్య సాయి భజన మండలి వారికి డాక్టర్ నజీర్ తో పాటు ఆసుపత్రి వైద్యులు, నర్సులు కృతజ్ఞతలు తెలియజేశారు.

దేవాలయానికి వాచకాలు ఏర్పాటు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పట్టణములోని లక్ష్మీ చెన్నకేశవ పురములో గల వైద్య నారాయణ ధన్వంతరి స్వామి దేవాలయమునకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు అవార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ ఆధ్వర్యంలో దేవాలయమునకు వాచకాల స్థాపన అత్యంత వైభవంగా అర్చకులు నాగేశ్వరరావు వేద మంత్రాల నడుమ నెలకొల్పారు. అనంతరం వార్డ్ కౌన్సిలర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి మనిషి మానవ సేవలు చేయడానికి సంకల్పంగా ఉంటే, భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ ప్రాంగణం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నెలవు కావాలని తెలిపారు. తదనంతరం ధర్మవరం న్యాయ బ్రాహ్మణ సోదరులు అందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాడు ఇంచార్జ్ మల్లన్న దేవాలయ అధ్యక్షులు రామచంద్ర,కార్యదర్శి ఆంజనేయులు తోపాటు లింగమయ్య, తిరుపతయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులు బలోపేతం చేయాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ కేంద్ర సహకార బ్యాంకు నందు గురువారం కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు లిఖిత బ్యాంకును సందర్శించి సహకార సమైక్య మొబైలైజేషన్ ఛాంపియన్ వాల్పోస్టర్ విడుదల చేస్తూ ఉమ్మడి జిల్లాల కింద 75000 ఖాతాలు ఉండాలని పెనుకొండ బ్రాంచ్ పరిధిలో 2100 ఖాతాలు ఉండాలని నవంబర్ డిసెంబర్ నెలలో 700 ఖాతాలు కొత్తగా తెరవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సురేఖ రాణి, టిటిసి సెల్ తేజస్విని, సహకార బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు,శుక్రవారం 03,నవంబర్ 2023

7 న ముఖ్యమంత్రి పుట్టపర్తికి రాక

విశాలాంధ్ర పుట్టపర్తి : ఈనెల 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి నందు డాక్టర్ వైయస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ పథకం పాల్గొంటారని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు తెలిపారు. గురువారం సాయంత్రం సమయంలో స్పందన సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అన్ని శాఖలు సమన్వయముతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లాలో రెండు లక్షల 75 వేల మంది రైతుల కు రైతు భరోసా ప్రధానమంత్రి కిషన్ యోజన లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. 7 వ తేదీ ఉదయం 9.30 గంటలకు పుట్టపర్తి ఎయిర్ పోర్టు రాక, పుట్టపర్తి వై జంక్షన్, పోలీస్ పేరడ గ్రౌండ్, రహదారుల వెంట, పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు, ఎయిర్ పోర్టు, ముఖ్యమంత్రి పర్యటన రాక, పోక, ప్రముఖులకు పాసులు మంజూరు చేయడం పుట్టపర్తి ఆర్డిఓ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, పటిష్టమైన భద్రత చర్యలు ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, కాన్వాయ్ సంబంధించిన వివరాలు రవాణా శాఖ అధికారి ఆధ్వర్యంలో చేపట్టాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాగునీరు సౌకర్యం, శానిటేషన్ సౌకర్యం చేపట్టాలని తెలిపారు. డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో వైద్య శిబిరం అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు, రేపటి రోజు మరల ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు పుట్టపర్తి శివారు ప్రాంతంలోని వై.జంక్షన్ లో ఉన్న బహిరంగ సభ వేదిక (ప్రైవేట్ క్రికెట్ మైదానము) నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆర్ అండ్ బి ,ట్రాన్స్కో, రవాణా ,ఆర్టీసీ, డి ఎస్ ఓ, అన్ని సంక్షేమ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టి కార్యక్రమంలో విజయవంతం చేయుటకు కృషి చేయాలన్నారు. లబ్ధి దారులతోపాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొనే విధంగా ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా బాధ్యతా యుతంగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డి ఆర్ డి ఎ పి డి నరసయ్య,పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డా.ఎం.టి.నాయక్, డిసిఓ కృష్ణ నాయక్, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్ భాష, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్ ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రామకృష్ణ, ఏపిఎంఐపి పిడి సుదర్శన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఐసిడిఎస్ పిడి లక్ష్మి కుమారి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవాలి

విశాలాంధ్ర-శింగనమల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. నార్పల మండల కేంద్రంలోని గ్రామ సచివాల యం-1 పరిధిలో అధికారులు, వాలంటీర్లు సచివాలయ సిబ్బందితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగనన్న పాలనలో ఆయా కుటుంబాలకు జరిగిన మేలును సంబంధించిన సంక్షేమ పథకాల కర పత్రాలు అందజేశారు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించాలని సూచించారు,పేదల కుటుంబాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు,గత నాలుగున్నరేళ్లల్లో దాదాపు రూ.5,89,088 లక్షల మేర లబ్ధి చేకూరిందని లబ్ధిదారుడు వందన సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి..పాల్తూరు బస్సు సర్వీసును పునరుద్ధరించండి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నుండి బళ్లారి (వయా పాల్తూరు, రూపనగుడి మీదుగా) బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని వైఎస్ఆర్సిపి పార్టీ రాష్ట్ర యువనేత కొనకొండ్ల భీమిరెడ్డి గురువారం ఏపీఎస్ఆర్టీసీ ఎండి ద్వారక తిరుమలరావు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఎమ్మెల్సీ వై. శివరామ రెడ్డి చొరవతో ఈ మధ్యకాలంలోనే కర్ణాటక- ఆంధ్ర ప్రదేశ్ అంతరాష్ట్ర రవాణా అగ్రిమెంటు రెన్యూవల్ చేయబడినదని, కావున వెంటనే ఉరవకొండ-బళ్లారి బస్సు సర్వీసులు ప్రారంభించాలని అందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎండి అగ్రిమెంటు ప్రభుత్వ ఆమోదం కొరకు వెళ్ళినదని త్వరలోనే బస్సు సర్వీసు ప్రారంభిస్తామని తెలిపారని పేర్కొన్నారు.

ఊపిరితిత్తుల రక్తనాళాల్లో గడ్డకట్టిన రక్తం

▶▶అత్యాధునిక చికిత్సతో కిమ్స్ సవీరా ఆస్పత్రిలో ఊరట

▶▶ఒక్క రోజులోనే నయం చేసిన డాక్టర్ మూడే సందీప్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : ఊపిరితిత్తులకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో గడ్డ అడ్డుపడి.. తీవ్ర అనారోగ్యానికి గురైన రోగికి కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు అత్యాధునిక పద్ధతిలో చికిత్స చేసి తక్షణం ఊరట కల్పించారు. ఆస్పత్రికి చెందిన సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు.

ఫైలేరియా వ్యాధి నిర్దారణ పై శిక్షణ

విశాలాంధ్ర - అనంతపురం వైద్యం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం మలేరియా విభాగం నందు జిల్లా మలేరియా అధికారి ఓబులు అధ్యక్షతన ఉమ్మడి అనంతపురం జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారులకు ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ మాసాలలో ఫైలేరియా (బోధకాలు వ్యాధి)నిర్ధారణకు రాత్రి పూట రక్తపూతల సేకరణ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ ప్రకారం బ్లాకుల వారిగా రాత్రి వేళ 8 గంటల నుండి 11గంటల వరకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది సహకారంతో రక్తపూతలు సేకరించి ల్యాబ్ కు పంపించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 42 గ్రామాలలో రక్తపూతలు సేకరించి పరీక్షిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ మరియు లక్ష్మి నాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి గిరిధర్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల మలేరియా సబ్ యూనిట్ అధికారులు, సూపర్వైసోర్స్ పాల్గొన్నారు.

డిఈని కలిసిన బహుజన చైతన్య వేదిక సభ్యులు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నందు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దస్తగిరి బాబుని గురువారం బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు బహుజనచైతన్య వేదిక వ్యవస్థాపకులు, అడ్వకేట్ హైకోర్టు శివ రామకృష్ణ మరియు వెంకటేషులు, రవికుమార్,రామాంజి,రామకృష్ణ, ఆంజనేయులు, కదిరిప్ప, పోతలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయండి

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఏ తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి రాధమ్మ, జడ్పీటీసీ భూతరాజు, ఎంపిడిఓ రామారావు, తహశీల్దారు నాగభూషణం, ఈఓఆర్డి నాగరాజు నాయక్, విద్యుత్ ఏఈ విశ్వనాథ్,సిడిపిఓ పద్మావతి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్లు ఎంజారేగౌడ్, రంగస్వామి, లక్ష్మీనారాయణ, శివరుద్రమ్మ, ఎంపిటిసిలు రామచంద్ర, రత్నమ్మ, సుశీల, రాజు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్ ఇంచార్జిని పరామర్శ

విశాలాంధ్ర-గుడిబండ: మండలం పరిధిలోని కేకే పాళ్యం గ్రామానికి చెందిన క్లస్టర్ ఇంచార్జి లక్ష్మీ నరసప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి,లక్ష్మీ నరసప్ప, స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మడకశిర తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, క్లస్టర్ ఇంచార్జ్ భీమరాజు, మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఎన్పీకుంట : అన్నదాతలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల శ్రేయస్సు కొరకుఅధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం 1 వద్ద నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించేందుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి పాల్గొని నూతన భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు అన్ని విధాల అందుబాటులో ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలోనే లభిస్తాయన్నారు. అదేవిధంగా రైతు పండించిన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని వివరించారు. ప్రతి రైతు కుటుంబాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, వైసీపీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, ఉప సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి,ఆర్ బి కే చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, తహసిల్దార్ నరేంద్ర కుమార్, పంచాయతీ కార్యదర్శులు రమేష్, ముబారక్, వాటర్ షెడ్ చైర్మన్లు భయ్యా రెడ్డి, కృష్ణారెడ్డి , సచివాలయ సిబ్బంది యుగంధర్, ధనలక్ష్మి, నరసింహారెడ్డి, అంజి నాయక్ ,వైసిపి నాయకులు శ్రీరాములు, చెన్న కృష్ణారెడ్డి, కార్యకర్తలు వైసిపి అభిమానులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ,కొల్లురవీంద్ర లపై అక్రమ కేసులు

హిందూపురం పార్లమెంట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్

విశాలాంధ్ర-గోరంట్ల: శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, పెనుకొండ నియోజకవర్గ ఇంచార్జీ బికే. పార్థసారథి ఆదేశాల మేరకు గురువారం గోరంట్ల పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా కల్తీ, నాసిరకమైన మద్యం అమ్మి లక్ష కోట్లు దోచుకున్న జగన్ రెడ్డి చంద్రబాబు హయాంలో మద్యం కుంభకోణం జరిగిందంటూ కేసు పెట్టడం దుర్మార్గంమని అన్నారు. చంద్రబాబు, కొల్లురవీంద్రపై తప్పుడు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వరసగా చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడాన్ని దారుణమని మద్యంలో దోచుకున్న దెవరో పసిపిల్లాడిని అడిగినా చెబుతారని అన్నారు. చంద్రబాబు నాయుడు ఏదో చేశారంటూ కేసులు పెట్టడం జగన్ రెడ్డి పైశాచికత్వానికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమాల జయరాం (బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్),రవి మోహన్ (పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి),బెల్లాల చెరువు చంద్ర (వాల్మీకి స్టేట్ డైరెక్టర్),అజ్మతుల్లా (మైనార్టీసెల్ సహాయ కార్యదర్శి),వేణు గోపాల్ రాయల్ (పార్లమెంట్ సెక్రటరీ),మెడికల్ స్టోర్ శ్రీనివాసులు,మల్లికార్జున,వాల్మీకి సోము,రాయల్ శీనా, సోమశేఖర్, మరెడ్డి పల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రహదారి పరిశీలన

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం నుండి స్థానిక ప్రధాని రహదారి నమధ్యలో నిర్మాణాలు కట్టారు. రహదారి గుండా వాహనాలతో పాటు ప్రతి సంవత్సరం జరిగే చౌడేశ్వరి అమ్మవారిఉత్సవాలు ఊరేగింపులు జరుపుకొనుటకు చాలా ఇబ్బందిగా మారిందని, అందు వలన సర్పంచ్ షబ్బీర్ , పంచాయతీ సెక్రెటరీ చంద్ర, చెర్యలు తీసుకొని పంచాయతీ ద్వారా ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చి వారికి సమస్య గురించి చెప్పడం తెలపడం జరిగిందని, ఇందులో భాగంగా సిఐ రాజేంద్రనాథ్ యాదవ్ రహదారిని పరిశీలించి ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది ఎమ్మార్వో వెంకటరెడ్డి,సహాయకారాలతో బస్టాండ్ ప్రాంతంలోకి వెళ్లి ఇల్లు నిర్మించిన వాటిని పరిశీలించి ఇంటి ఓనర్లకు సమస్య ఇవ్వడం జరిగింది. తొందరలో జరగబోయే ఉత్సవాల సందర్భంగా అడ్డంగా ఉన్న ఇళ్లను తొలగించవలసిందిగా రెవెన్యూ సిబ్బందికి తెలియజేశారు. ఇ ఓ ఆర్ డి నసీమ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా నాలుగు అడుగులు పొడవు తొలగిస్తామని ఇంటి యజమానులకు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యస్ ఐ బలరామయ్య, ఎమ్. ఆర్.ఒ. వెంకటరెడ్డి,ఎ. ఎస్.ఐ. ధనుంజయ రెవెన్యూ సిబ్బంది ఆర్ ఐ ,ఈశ్వరయ్య వీఆర్వో పవన్ కుమార్ రెవెన్యూ సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేయాలి

విశాలాంధ్ర - యాడికి : ఎస్సీ వర్గీకరణను బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ 44వ నంబరు జాతీయ రహదారి కాశేపల్లి టోల్ ప్లాజా దగ్గర ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ జె.ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న యాడికి సిఐ శంకర్ రెడ్డి వెంటనే జాతీయ రహదారి పై ధర్నా చేస్తున్న స్థలానికి వెళ్లి ఎమ్మార్పీఎస్ నాయకులతో మాట్లాడి ధర్నా విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల యువజన నాయకుడు గండికోట లక్ష్మణ్ ఇతర ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి చెక్కు పంపిణి

విశాలాంధ్ర-గోరంట్ల: కర్ణాటక ప్రాంతంలోని చిక్బల్లాపూర్ వద్ద అక్టోబర్ 26వ తేదీన సిమెంట్ ట్యాంకర్ ను టాటా సుమో ఢీకొన్న ప్రమాదంలో గోరంట్ల మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన వెంకటాద్రి మరియు బోయలక్ష్మి దంపతులు మృతి చెందారు, అయితే గత వారంలో ఒకరికి ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే మాల గుండ్ల శంకరనారాయణ చేతుల మీదుగా ఐదు లక్షల చెక్కును మంజూరు చేశారు, అయితే మరొకరు బోయ లక్ష్మి కి మంజూరైన ఐదు లక్షల చెక్కును మృతుల తల్లిదండ్రులు నాగప్ప, లక్ష్మీనరసమ్మకు తహసిల్దార్ రంగనాయకులు, సింగిల్ విండో అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ శ్రీరాములు, ఉప సర్పంచ్ బుల్లెట్ బాబు లా ఆధ్వర్యంలో గురువారం వానవోలు గ్రామానికి వెళ్లి 5 లక్షల చెక్కును అందజేశారు, ఈ సందర్భంగా ఎక్స్గ్రేషియా ప్రభుత్వం ద్వారా 10 లక్షలు మంజూరు చేసినందుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర-ఓడిసీ రూరల్: గురువారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఓడి చెరువు మండలం సున్నంపల్లి గ్రామపంచాయతీలోని పెద్దగుట్లపల్లి గ్రామంలో 20 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను జడ్పిటిసి దామోదర్ రెడ్డి భూమిపూజ చేసీ ప్రారంభించారు. గ్రామానికీ రోడ్డు వేయాలని గ్రామస్థుల తరపున స్థానిక నాయకులురాష్ట్ర రైతు సంఘం నాయకులు మలక ఆశ్వర్థరెడ్డి తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి స్పందించి 20 లక్షల రూపాయలు గ్రాంట్ విడుదల చేశారని ఎన్నో ఏళ్లుగా నెరవేరని రోడ్డు పనులు ఇప్పుడు వైకాపా ప్రభుత్వంలో చిరకాల కోరిక నెరవేరడంతో స్థానిక నాయకులు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మలక ఆశ్వర్థరెడ్డి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి కృత్జతలు తెలిపారు. మాజీ సింగల్ విండో డైరెక్టర్ ఎద్దుల ఆశ్వర్థరెడ్డి రవి,ఎంపీటీసీ గంగులప్ప, ఆదినారాయణ ,వైఎస్ఆర్సిపి నాయకులు,హనుమంత్ రెడ్డి ,ఆనంద రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ నాయకులు వ్యక్తం చేశారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధిపై సమీక్ష

విశాలాంధ్ర-రొళ్ల: మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు ఏడిసిసి బ్యాంకు అభివృద్ధిపై సింగల్ విండో అధ్యక్షులు మోతిరామ్ నాయక్ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్లు ఎస్.ప్రకాష్ గౌడ్,తిప్పేమల్లప్ప,ఏడిసిసిబ్యాంక్ మేనేజర్ జి.జయరామ్ చౌదరి, అసిస్టెంట్ మేనేజర్లు గోవిందరెడ్డి, పాపిరెడ్డి,సీఈఓ ఎ.హనుమంతరాయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ బ్యాంకు నందు అర్హత ఉన్న ప్రతి రైతులకు క్రాఫ్ లోన్లు టూవీలర్ ఫోర్ వీలర్ లోన్లు మరియు ఎల్.టి లోన్లు గొర్రెలు ఆవులు గోల్డ్ లోన్లు జి.ఎల్.జి లోన్లులను ఇలా అనేక సౌకర్యాలను సొసైటీ బ్యాంక్ నందు కల్పిస్తామన్నారు.రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అల్లాబకాష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆలుపనపల్లి శ్రీనివాస్, సచివాల కన్వీనర్ గోవిందప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీకి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గురువారం నియోజకవర్గ ఇన్చార్జ్ పార్థసారథి నేతృత్వంలో 45 రోజుల పాటు నిర్వహించే బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యాచరణ,ఇంటింటి ప్రచార కార్యక్రమం షెడ్యూల్ను తయారు చేసుకోవడంతో పాటు, ప్రచార కార్యక్రమం విధి విధానాలను, తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో గురించి మరియు స్థానికంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలు, స్థానిక ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు, వైఫల్యాల గురించి నియోజకవర్గ ప్రజలకు వివరించే కార్యక్రమంలో భాగంగా మండలం పరిధిలోని రాంపురం, అమ్మవారిపల్లి, మునిమడుగు నాయకులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-గోరంట్ల: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కిట్లు గోరంట్ల లో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోనే ఏ పార్టీ చేపట్టని విదంగా పవన్ కళ్యాణ్ కార్యకర్తల బాగోగుల కోసం 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ తెచ్చాడు కార్యకర్తల క్షేమం కోసం ఇంతలా ఆలోచించే నాయకుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు, రానున్న 2024 ఎలక్షన్లలో పొత్తులో భాగంగా జనసేన.టిడిపి అధికారం చేపట్టబోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి సురేష్. సంయుక్త కార్యదర్శి వెంకటేష్. జిల్లా కార్యక్రమాల కమిటీ సభ్యుడు పొగతోట వెంకటేష్ మండల అధ్యక్షుడు సంతోష్, మండల నాయకులు. నరేష్,నాగేష్, రాఘవేంద్ర, బాబావలి,శ్రీనివాసులు.వసీం. ఆంజనేయులు, శ్రీరాములు, రాజేంద్ర,శ్రీకాంత్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.